www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 మార్చి 2025
5
తూర్పుగోదావరి



అటు ఎండ.. ఇటు మంచు..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఒకవైపు ఎండలు మండుతుండగా మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం ఏడు గంటలవుతున్నప్పటికే మంచు దుప్పటి కప్పుకునే ఉంది. మార్చి నెల మూడో వారం, ఉదయం పూట అధిక ఎండలు కొనసాగుతున్నా మంచు వీడడం లేదు.



కాల్దారి తణుకు రహదారిపై మంచు

ఫీల్డ్ అసిస్టెంట్లపై పని దినాల కత్తి

లక్ష్యం చేరుకోకపోతే వేతనం నిల్

ఆందోళనలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి వేలాడుతోంది. దీంతో ప్రజా ప్రతినిధులను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశలవారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడం తోపాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవడంతో వెనుకపడుతూ వచ్చారు. ఈ విధంగా దశలవారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేసే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధి దూరమవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో టార్గెట్లను ఉపసంహరించుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం నెలకు రూ.26000 అమలు చేయాలనే డిమాండ్ ముందుకొస్తోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500–6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి గ్రేడ్‌గా పరిగణించి రూ.7,900 వేతనం, రూ.350 అలవెన్స్‌లు, 5,000 నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి గ్రేడ్‌గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 5,000 కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. వీరిని సీనియర్ మేట్‌గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయినట్లు తెలుస్తోంది. ఎ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్ కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.



కూలీలత ఉపాధి పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలు మించి పనులు జరగడం లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావుడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు ఉన్నందున ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ప్రస్తుత వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రెండేళ్లుగా వ్యవసాయ పనుల్లో జనం బిజీగా ఉండటంతోనూ ఉపాధి పనులు పెద్దగా సాగడం లేదు. ఈ పరిస్థితులలో తమ ఉద్యోగ భద్రత కరువైందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దశలవారీ ఆందోళనలను ప్రారంభించారు. మున్సిపాలిటీలలో విలీనమైన గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించి 200 రోజులు పని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జూనియర్ మేట్, సీనియర్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పరిగణించి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

వేసవి నేపథ్యంలో నిర్దిష్ట కార్యాచరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వేసవి వడగాలుల నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్‌లో క్షేత్ర స్థాయి అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వడగాలుల తీవ్రత దృష్ట్యా సమన్వయ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. చలివేంద్రాలలో కుండల ద్వారా చల్లని శుద్ధమైన తాగునీరు సరఫరా చేయాలని, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటి పూట బడులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వడగాలులు తీవ్రత దృష్ట్యా చేయదగినవి, చేయతగని వాటిపై గ్రామాల్లో, వార్డుల్లో ప్రచారం చేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు పని చేసే ప్రదేశాల్లో నీడ ఉండేలా టెంట్స్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పాలిచ్చే తల్లుల విషయంలో వారికి సాధ్యమయ్యే పనులను ఇవ్వాలని, ఎండ తీవ్రత పెరగకుండా సమయ పాలన విషయంలో ముందుగా పనులను ప్రారంభించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఐస్ సరఫరా చేసే ఫ్యాక్టరీల నిర్వహణ వ్యవస్థ దృష్టి పెట్టాలని, శుద్ధమైన నీటితో మాత్రమే ఐస్ తయారు విధానంలో పర్యవేక్షిస్తున్నారో లేదో తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటి పూట బడులు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పాఠశాలల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వర రావుకు 919398680029లో ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ కార్మికులకు, విద్యా సంస్థలకు, తగిన విధంగా ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బివి.గిరి, డిపిఒ వి.శాంతామణి, డిఇఒ ఎస్.వాసుదేవరెడ్డి, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, కె.విజయ్ కుమార్, డిఎంహెచ్‌ఒ తరపున ఎన్. వసుంధర, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

23న యుటిఎఫ్ ప్రాంతీయ విద్యాసదస్సు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యా సదస్సు ఈ నెల 23న రాజమహేంద్రవరంలో నిర్వహిస్తుననట్టు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ పేర్కొన్నారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో గురువారం జయకర్ అధ్యక్షతన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. జయకర్ మాట్లాడుతూ యుటిఎఫ్ పోరుబాటలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం హాజరవుతారని చెప్పారు. యుటిఎఫ్ కార్యకర్తలు మండలాల స్థాయిలో సర్వే నిర్వహించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి మాట్లాడుతూ 117 జిఒ రద్దు, పాఠశాలల విలీనంపై ప్రభుత్వం స్పందించాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల రూ.25 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, ఉపాధ్యక్షులు విజయ్ గౌరి, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, కార్యదర్శులు ఇ.శ్రీమణి, దయానిధి, ఎం.శ్రీనివాస్, కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి, వి.వెంకటరమణ, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ఆయాల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

అంగన్‌వాడీ ఆయాల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పలువురు సిపడిపిఒలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెరవలి ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో ఉనకరమిల్లి, అన్నవరప్పాడు, పసలపూడి, ఎంవి.నగర్, దమ్మెన్ను, కాల్దరి గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన స్థానిక వివాహిత మహిళలు కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 21 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుండి 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు పూర్తి చేసిన దరఖాస్తులు ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు.

ఉండ్రాజవరం మండలంలోని పసలపూడి, కాల్దారి, దమ్మెన్ను, గ్రామాల్లో నాలుగు పోస్టులు భర్తీ చేయనున్నట్టు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 29న సాయంకాలం ఐదు గంటల్లోపు అందించాలని పేర్కొన్నారు.

చాగల్లు కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లోని చాగల్లు మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రాజెక్ట్ అధికారి డి.మమ్మీ తెలిపారు. దరఖాస్తులు 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ప్రకృతి సాగుతో మేలు

ప్రజాశక్తి-కడియం

రైతులు ప్రకృతి సాగు విధానం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకతి వ్యవసాయ పంటలకు కషాయాలు ఉపయోగిస్తే భూమి, గాలి, నీటిని బాగు చేసుకోవచ్చన్నారు. మహిళా రైతులు కూడా వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఆదర్శ రైతులు అన్నందేవుల చంటి, పెనుమర్తి వెంకటరావు, కొప్పాల నాగేశ్వరరావు, చిక్కాల ఈశ్వరరావు, ప్రగడ రాంబాబు, దేవర్లంక ఆనందరావు, గుత్తుల శేషారావులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, డిపిఎం తాతారావు, డిహెచ్ఒ సుజాత కుమారి, ఎడిపిఎం వలీ, ఎడిఎ శ్రీనివాస్ రెడ్డి, ఎఒ ద్వారకాదేవి, హెచ్ఒ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

27న ఉండ్రాజవరం ఉప సర్పంచ్ ఎన్నిక

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

మండల కేంద్రమైన ఉండ్రాజవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడినట్టు ఇఒపిఆర్‌డి కె.ఆంజనేయ శర్మ గురువారం తెలిపారు. దీని ప్రకారం ఈ నెల 24న నోటిఫికేషన్ విడుదల, అదే రోజు సభ్యులందరికీ సమాచారం అందిస్తామని తెలిపారు.

ఘనంగా పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి-గోకవరం, తాళ్లపూడి

మండల కేంద్రమైన గోకవరం సంజీవయ్య నగర్ ఎంపిపి స్కూల్లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు డిసిహెచ్‌కె బాబాజీ రెడ్డి మాట్లాడుతూ పిచ్చుకలు ఇంటివద్ద ఎల్లప్పుడు తమ ఆహారమైన ధాన్యం, గంట్లు, బియ్యం మొదలైన గింజలు తినడానికి కేవలం వాటర్ బాటిల్, చెక్క గంటను ఉపయోగించి ఒక పరికరాన్ని పాఠశాలలో ప్రదర్శించారు. ఈ పరికరం అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని, పిల్లలందరూ తమ ఇంటి వద్ద సులభంగా తయారు చేసుకుని, అంతరించిపోతున్న పిచ్చుకల పరిరక్షించాలని, జీవ వైవిధ్యం కోసం కృషి చేయాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం కె.వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి పర్యావరణ పరిరక్షణ మీద ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

తాళ్లపూడి ప్రకృతిలో పక్షుల యొక్క ఆవశ్యకతను తెలుసుకొని చిన్నతనం నుండి పక్షి జాతిని సంరక్షిస్తూ ఆ జాతిని పెంచడాన్ని ప్రతి విద్యార్థి చిన్నతనం నుండి అలవాటు చేసుకోవాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పిచ్చుకల బొమ్మల వేయించి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ పిచ్చుకల ఆవశ్యకతను వివరిస్తూ పిచ్చుకల దినోత్సవం ఎందుకు ప్రపంచ దేశాలు ముందుకు వచ్చాయో తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు పాఠశాల ఆయా కుమారి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వరలక్ష్మి పాల్గొన్నారు.



గోకవరంలోని పిచ్చుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

జెఎల్‌బి స్కూల్‌ను విలీనం చేయరాదు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లును మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (జెఆర్‌బి)ను నెలటూరు పాఠశాలలో విలీనం చేయరాదని విద్యాశాఖ అధికారులకు గ్రామస్తులు గురువారం వినతిపత్రం అందజేశారు. చాగల్లులో జూనియర్ బేసిక్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను 1938లో స్వాతంత్ర్యం రాకముందు ప్రారంభించారని, అటువంటి పురాతన పాఠశాలను ప్రాంతానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని ప్రక్క గ్రామమైన నెలటూరు పాఠశాలలో విలీనం చేసి ఫౌండేషన్ పాఠశాలగా మార్చేందుకు అధికారులు నిర్ణయించడంతో పాఠశాల యాజమాన్య కమిటీ విద్యార్థుల తల్లిదండ్రులు, సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు, సిఐటియు నాయకులు గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, ఎస్‌కె.ఆదాము మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలను బేసిక్ పాఠశాలగానే ఉంచాలని ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకూ పాఠశాలను నిర్వహించాలని, తమ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా చెయ్యాలని ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఫౌండేషన్ పాఠశాలలు మూత పడతాయని దానిలో భాగంగానే ఈ పాఠశాలను కూడా మూతవేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పిల్లల తల్లితండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రతిరోజు నడిచి వెళ్లి రాలేరని, మూడు రోడ్లు దాటి వెళ్లి రావాల్సి ఉన్నందున తాము ఉదయం పనులకు వెళ్లే సమయంలో రెండు పాఠశాలలో మా పిల్లలను దిగబెట్టడం కష్టంగా ఉంటోందని తెలిపారు.



విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

23న భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ వర్ధంతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ నెల 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్టు సీనియర్ న్యాయవాది తోరాటి వసంతరావు తెలిపారు. గురువారం లాలాచెరువు వద్ద ఉన్న 'హేతువాద మానవ వాద' కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వసంతరావు మాట్లాడారు. సభలో 'నిత్యజీవితంలో శాస్త్రీయ దక్పథం–ఆచరణ' అంశంపై జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ సిహెచ్.రవికుమార్, 'నేటి పరిస్థితుల్లో భగత్ సింగ్ ఆలోచనల ప్రాసంగికత' అనే అంశంపై ఎయిమ్స్ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె.విజయకుమార్, 'చరిత్ర వక్రీకరణలు దేనికోసం' అంశంపై దారి దీపం మాసపత్రిక సంపాదకుడు డివివిఎస్.వర్మ, 'మత గ్రంథాలు– పరిశీలన' అంశంపై ప్రముఖ రచయిత డిఆర్.ఇంద్ర ఉపన్యసిస్తారని తెలిపారు. వేమన ఫౌండేషన్ నాయకులు ఆచంట వరప్రసాద్ సభకు ముగింపు పలుకుతారని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ చైతన్య శేఖర్, డిజి.ప్రసాద్, డాక్టర్ ఎన్ఎస్.శర్మ, పి.శ్రీను, నిశ్చల్, తాతారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ అధికారుల 'పల్లె నిద్ర'

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తొర్రేడు గ్రామంలో ఎఎస్‌పి అల్లూరి వెంకట సుబ్బరాజు గురువారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల గురించి అవగాహన కల్పించారు. చెడు నడత కలిగిన వ్యక్తుల సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించారు. గ్రామ పెద్దలతో వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి, బాల్య వివాహాలు, డయల్ 112, శక్తి యాప్, సోషల్ మీడియా, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని పరిష్కరించడానికి కషి చేస్తామని తెలిపారు. ఈ పల్లెనిద్ర కార్యక్రమంలో సిఐ వీరయ్య గౌడ్, ఎస్ఐ మనోహర్ పాల్గొన్నారు.

ఆహార భద్రతపై జాతీయ వర్క్ షాప్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య, నిర్వహణ శాస్త్ర విభాగం, మైక్రో బయాలజీ విభాగం, వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యాన ఆహార భద్రత, వినియోగదారుల అవగాహన అనే అంశంపై గురువారం జాతీయ వర్క్ షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ జె.చంద్రప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె మాట్లాడుతూ ఆహార భద్రత యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. కో ఆర్డినేటర్స్ డాక్టర్ ఎ.అన్నపూర్ణ, డాక్టర్ టి.సోనీ నివేదికలను సమర్పించారు. కన్వీనర్లు డాక్టర్ పివివి.సత్యనారాయణ, డాక్టర్ టి.సుజాత మాట్లాడారు. అనంతరం ఆహార కల్తీపై అవగాహన కల్పించేందుకు మైక్రోబయాలజీ విభాగం వారు ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం సంకల్ప– జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఈ జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంకల్ప మెగా జాబ్ మేళాలో 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. వివిధ ఉద్యోగాల్లో చేరేందుకు ఎస్ఎస్‌సి, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, ఎం.టెక్, ఫార్మసీ, ఎంబిఎ, ఎం.కాం తదితర కోర్సులు పూర్తి చేసిన 19 నుండి 50 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విడిజి.మురళి వివరాలు వెల్లడించారు. https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని మరింత సమాచారం కోసం 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కార్టూ'నిజం'





విసి ప్రసన్నశ్రీకి శక్తి ప్రేరణ సమ్మాన్ అవార్డును ప్రదానం చేస్తున్న సభ్యులు

విసికి శక్తి ప్రేరణ సమ్మాన్ అవార్డు

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి ఆచార్య సాతుపతి ప్రసన్నశ్రీకి 'శక్తి ప్రేరణ సమ్మాన్' అవార్డును ప్రదానం చేశారు. యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రశక్తి రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వనపల్లి పద్మావతి సభ్యులు విసి ప్రసన్నశ్రీని గురువారం సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించి, భాష పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు ప్రదానం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు కషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయంతో సంయుక్తంగా భవిష్యత్‌లో మహిళలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించవచ్చని తెలిపారు. వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలను విశ్వ విద్యాలయానికి ఆహ్వానించి విద్యార్థులకు స్ఫూర్తిని నింపుదామన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో యూనివర్సిటీ ఉమెన్ సెల్ కో ఆర్డినేటర్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, డాక్టర్ ఎన్.సజనరాజ్, ఆంధ్రశక్తి సభ్యులు డాక్టర్ సుష్మ ప్రియ, డాక్టర్ సుజాత, డాక్టర్ గౌరీపార్వతి, శ్రీరాజరాజేశ్వరీదేవి పాల్గొన్నారు.



పెద్దగూడెంలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పెద్దగూడెంలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-గోపాలపురం

స్టోరేజ్ ట్యాంకులను తప్పని సరిగా క్లోరినేషన్ చేయ్యాలి, ఎప్పటికప్పుడు నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పెద్దగూడెంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. అక్కడ ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా గ్రామపంచాయతీలో తాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, రానున్న రోజుల్లో వడగాల్పుల తీవ్రత దష్ట్యా ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. గ్రామంలో డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇక్కడ సేకరించిన నీటి నమూనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్షించినట్టు తెలిపారు. వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు నిరంతర ప్రజలకు అందించడం సాధ్యం అవుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ టి.రాజీవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ జిటివి.అజయ్ బాబు, ఎఇ బంగారయ్య, గ్రామ కార్యదర్శి వి.అనురాధ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



అరెస్ట్ అయిన తండ్రి రాజుతో పోలీసు అధికారులు

కుమార్తె మృతి కేసులో తండ్రి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కన్న కూతుర్ని, కొడుకుని కాలువలో తోసిన ఘటనలో కూతురు మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజును పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలను గురువారం రామచంద్రపురం డిఎస్‌పి బి. రఘువీర్ విలేకరులకు వివరించారు. రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పులకు భయపడి పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసు కోవాలని అనుకున్నాడని తెలిపారు. పథకం ప్రకారం తన కుమారుడు రామ సందీప్‌ను, కుమార్తె కారుణ్యలను వారు చదువుతున్న భాష్యం స్కూల్ నుండి ఈ నెల 17న తీసుకువచ్చాడన్నారు. నెలపర్తిపాడు వద్దగల గణపతి నగర్ పంట కాలువ వద్ద కు వారిద్దరినీ తీసుకువెళ్లి కుమార్తెను, కుమారుడును కాలవలోనికి తోసివేశాడన్నారు. ఈ సంఘటనలో కుమార్తె కారుణ్య(7) అక్కడికక్కడే మతి చెందిందని అన్నారు. ఈ సంఘటనలో కుమారుడు తప్పించుకుని విషయాన్ని పోలీసులకు తెలిపాడన్నారు. ఈ ఘటనపై ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ లో ఈ నెల 17న కేసు నమోదు చేశామన్నారు. అప్పటినుండి మూడు బృందాలుగా పోలీసులు ఏర్పడి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. రాజానగరం మండలంలోని రాధేపాలెం లో తమ బంధువులు ఇంటి వద్ద ఆశ్రయం పొందేందుకు వెల్లగా వారు మండపేట రూరల్ పోలీస్ స్టేషన్లో నిందితుడిని అప్పగించారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ నిందితుడిని అరెస్టు చేసి రామచంద్రపురం తీసుకువచ్చారని డిఎస్‌పి తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

కదులుతున్న రైలు నుంచి దిగుతుండగా జారిపడి యువకుడు మృతి చెందాడు. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దాపురంకు చెందిన సిముసిరి త్రినాథ్ (37) తన తల్లిని విశాఖపట్నం ఆసుపత్రికి తీసుకెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌లోని మహిళల బోగీలో ఆమెను ఎక్కించారు. సాధారణ బోగీ ఎక్కిన ఆయన సామర్లకోటలో దిగలేదు. తల్లి రైలు దిగి కుమారుడికి ఫోను చేయగా నిద్రపోతున్న త్రినాథ్ లేచి హడావుడిగా రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించారు. అప్పటికే రైలు కదలడంతో ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎల్‌ఐసి ఏజెంట్‌గా పని చేస్తున్నాడు.

గడ్డి మందు తాగిన వివాహిత మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెద్దపురపాడు శివారు వై.సావరం గ్రామానికి చెందిన కోరం సాధన(28) గడ్డి మందు తాగి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...కోరం రాజశేఖర్‌కు తాళ్లరేవు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సాధనతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భార్యపై అనుమానంతో ఆమెను అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి ఆమెకు, భర్తకు మధ్య గొడవ జరిగింది. ఈ సందర్భంగా చస్తే చావు అనడంతో ఆమె ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగేసింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు కాకినాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు ఎస్‌ఐ టి.సునీత తెలిపారు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నార్కెడి మిల్లి గ్రామ శివారు బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను లోడు చేసి తరలించుటకు సిద్ధంగా ఉంచిన ట్రాక్టరు ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రాము గురువారం తెలిపారు.

నేడు యానాం బంద్

ప్రజాశక్తి - యానాం

యానాం డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం యానాంలో బంద్ జరగనుంది. ఈ బంద్‌లో భాగంగా వర్తక, వాణిజ్య సంస్థలు, ఇతర షాపులు స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు ఇవ్వాలని యానాం వర్తక సంఘం ప్రతినిధులు మాజేటీ సత్యభాస్కర్, నల్లా వెంకన్న, కాపగంటి గోపాలకృష్ణ యానాంలో డంపింగ్ యార్డ్ సమస్య తో ఎక్కడిచెత్త అక్కడే కొన్ని రోజులుగా నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్య అందరదీ కనుక వ్యాపారులు ఆయా సంస్థలు యజమానులు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యానాంలో నేడు జరుగుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. రాజకీయాలకు అతీతంగా అందరి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలియచేసేందుకు జరుగుతున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పాటించాలని కోరారు. తద్వారా భవిష్యత్ తరానికి ఆరోగ్యకరమైన వాతావరణ పరిస్థితులను అందించవచ్చని తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అన్నారు. రూ.లక్షా యాభై వేలతో 160 మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. సర్పంచ్‌తో పాటు మండల శానిటేషన్ కో ఆర్డినేటర్ కె.ప్రకాష్ డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించారు.

అనాలోచిత పనులతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-నల్లజర్ల

దూబచర్లలో ముందుచూపు లేకుండా చేపట్టిన నిర్మాణ పనుల వల్ల ప్రజలు పలు ఇబ్బందులు పాలవుతున్నారని, తక్షణమే ఆ పనులు నిలుపుదల చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం గ్రామంలోని పదో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంకట్రావు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం పనుల్లో భాగంగా దూబచర్ల పంచాయతీ పరిధిలో నెల రోజులుగా ఇంటింటికీ తాగునీరు సరఫరా కోసం తవ్వకం చేపట్టారు. దూబచర్ల పంచాయతీ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారని, కొన్నిచోట్ల రోడ్డుకు ఒకవైపు డ్రైన్ తవ్వకం చేపట్టగా మరికొన్ని చోట్ల రోడ్డుకి ఇరువైపులా తవ్వకం చేపట్టారని తెలిపారు. ఇప్పటికే రోడ్డుకి ఒకవైపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉండడంతో అనాలోచితంగా చేపడుతున్న ఈ పనుల వల్ల డ్రైన్ తూరలు దెబ్బతిని నీరు రోడ్లపై పారడంతో ప్రజలు పలు అవస్థలు పడుచున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో వార్డులో ఈ సమస్య నెలకొనడంతో ఆ వార్డు ప్రజలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉన్నవైపున తవ్వకాలు నిలుపుదల చేయాలని కోరుచున్నారని తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు

ప్రభుత్వాసుపత్రి పరిశీలన

ప్రజాశక్తి-గోకవరం

స్థానిక ప్రభుత్వాసుపత్రిని గురువారం మానవ హక్కుల ఫౌండేషన్ సభ్యులు పరిశీలించారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాసు, డాక్టర్ బిసిహెచ్ సుమిత్రానందన్, మానవ హక్కుల ఫౌండేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఇందిర, మానవ హక్కుల ఫౌండేషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఝాన్సీ బృందం ఆసుపత్రిని సందర్శించి హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వనజ కుమారితో మాట్లాడారు. మానవ హక్కుల ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, సభ్యులు కరాసు శివరామకృష్ణ, బత్తిన రాజు, పెనుగొండ సత్యానందం రోగులతో మాట్లాడారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఫౌండేషన్ సభ్యులు

నన్నయ విద్యార్థికి విసి అభినందన

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థిని జి.రాణిశ్రీని విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం సన్మానించి అభినందించారు. యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో అమ్మ ప్రేమను వర్ణిస్తూ విద్యార్థి రాణిశ్రీ రాసిన పాటను గీతాలపన చేసి విసి ప్రసన్నశ్రీకి అంకితం చేశారు. దీనిపై విసి స్పందించి విద్యార్థి రాణిశ్రీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాణిశ్రీకి ఉన్న రచన ఆసక్తిని, లోతైన భావంతో అమ్మ ప్రేమను వర్ణించిన విధానాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఏలూరు జిల్లా పెదవేగి మండలం కూచంపూడిలోని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన రాణిశ్రీ నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఎ ఎకనామిక్స్ చదువుతూ విద్యతో పాటు రచనాశక్తిని పెంచుకుందని అభినందించారు. అమ్మ, నాన్న, స్నేహితులు, ప్రకృతి వంటి సామాజిక అంశాలపై పాటలు కవితలు రాయడం హర్షనీయమన్నారు. ఈ రచనలు అన్ని గ్రంథస్థం చేసి జన్మనిచ్చిన తల్లికి అంకితం ఇవ్వాలని రాణికి సూచించారు.



రాణిశ్రీని సన్మానించి అభినందిస్తున్న విసి ప్రసన్నశ్రీ

ఫిజియోథెరపీపై ఉద్యోగులకు అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పని ఒత్తిడి వల్ల శారీరక ఇబ్బందులను ప్రభుత్వ ఉద్యోగులు ఫిజియోథెరఫీ ద్వారా ఉపశమనం పొందవచ్చని హైదరాబాదు నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ఫిజియోథెరపిస్టులు డాక్టర్ మహేష్ కుమార్, డాక్టర్ రమేష్ సూచించారు. జిల్లా పరిషత్ సిఇఒ ఆదేశాల మేరకు, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పలు సూచనలు చేసినట్లు ఇఒపిఆర్‌డి కె.ఆంజనేయ శర్మ తెలిపారు. తలనొప్పి, మైగ్రేన్ మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు తదితర ఆరోగ్య సమస్యలకు నివారణ చిట్కాలు, సాధారణ వ్యాయామాల గురించి ఉద్యోగులకు వారు తెలియజేశారు. వైద్య సలహాలను పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను అధిగమించ వచ్చని వారు తెలిపారు.


అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

విద్యాభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి- సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి, విద్యాలయాల ఏర్పాటుకు సహకారం అందించాలని ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో మంత్రి లోకేష్‌ను ఎంఎల్‌ఎ కలిసి వినతిపత్రం అందించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌తో కలిసి రాజనగరం నియోజకవర్గంలో విద్యాభివద్ధికి అవసరమైన పలు అంశాలను నివేదికల రూపంలో ఎంఎల్‌ఎ బత్తుల అందిస్తూ వచ్చారు. తాజాగా మరోసారి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంత్రి లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసి నియోజకవర్గంలో విద్యా రంగానికి సంబంధించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాజానగరం నియోజకవర్గానికి ప్రభుత్వం మంజూరు చేసిన పాలిటెక్నిక్ కళాశాల, ఐటిఐ కళాశాలల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికే అధికారులు ప్రాథమిక నివేదికలను తయారు చేసి అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని మంత్రి లోకేష్‌ను కోరారు. ఈ వినతులపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించినట్టు ఎంఎల్‌ఎ తెలిపారు.


మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంఎల్‌ఎ బలరామకృష్ణ

అర్జీలు స్వీకరించిన రుడా ఛైర్మన్

ప్రజాశక్తి - సీతానగరం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. నిర్వహించారు. రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చైల్డ్ సేఫ్‌పై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో చైల్డ్ సేఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు వ్యక్తిగత భద్రత, విద్య, బాలల లైంగిక వేధింపులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆర్‌డిఎ హెచ్‌డిజి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న గ్రామ సంఘం అధ్యక్షులు, విఒఎలకు ఇస్తున్న శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాల్లో మహిళకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సన్యాసిరావు, సిసిలు రాజకుమారి, పేరయ్యనాయుడు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సుధా కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలో జూనియర్ ఇంటర్మీడియట్, 5వ తరగతి బ్యాక్ లాగ్ అడ్మిషన్లు కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకూ పొడిగించినట్లు ప్రిన్సిపల్ ఎర్నెస్ట్ సికెపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, బ్యాక్ లాగ్ అడ్మిషన్లు 6, 7, 8, 9 (ఇంగ్లీష్ మాధ్యమం) తరగతుల ప్రవేశానికి అర్హులైన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

21న విద్యా శాఖ విజ్ఞాన విహారయాత్ర

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న విద్యా విజ్ఞాన విహారయాత్ర నిర్వహిస్తారని డిఇఒ షేక్ సలీం భాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా విజ్ఞాన విహర యాత్రను ఈనెల 21వ తేదీ కలెక్టరేట్ ప్రాంగణం నుంచి జెసి తదితరుల సమక్షంలో ఈ యాత్రను ప్రారంభిస్తారన్నారు. విహారయాత్రలో 131 మంది విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో భాగంగా విద్యార్థులు ఐఐటీ తిరు పతి, రీజనల్ సైన్స్ సెంటర్, తిరుపతి జూలాజికల్ గార్డెన్, చంద్రగిరి కోట వంటి ప్రదేశాలను సందర్శించనున్నారన్నారు. అనంతరం జిల్లా లో కోరింగ అభయారణ్యాన్ని పరిశీలిస్తారన్నారు.

శిరీషకు ఘన సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సచివాలయ కార్యదర్శిగా సేవలు అందించిన శిరీష పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగన్నతి పొందిన సందర్భంగా అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. గురువారం అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓరుగంటి సూరిబాబు, ఎస్.శ్రీనగేష్, జి.కృష్ణమోహన్, ప్రసాద్ నాయుడు, రాజా, రవిశంకర్ పట్నాయక్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చేపల వేటపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే ఎన్‌ఎఫ్‌సిఎల్ చెరువులో అనధికార చేపల వేటకు అడ్డుకట్ట వేయాలని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను కోరారు. గురువారం ఆయన కమిషనర్‌ను కలిసి ఫిల్టర్ బెడ్ చెరువు పరిస్థితిపై వివరించారు. ఫిషర్ మెన్ సొసైటీకి చేపలవేటకు ఇచ్చిన గడువు ఈనెల 16వ తేదీతో ముగిసిందని తెలిపారు. 10 రోజుల్లో చెరువును మొత్తం ఎండగట్టి కొత్తగా నీరు పెట్టాల్సివుందన్నారు. అయితే రాత్రి సమయాల్లో ఔట్‌లెట్ వాల్వ్‌ను ఆపి అనధికారికంగా చేపల వేట కొనసాగిస్తున్నారని వివరించారు. అనధికారిక చేపల వేటను నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని ఆయన కోరారు.

ఆశీల వేలం వాయిదా

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కమిషనర్ కెవి. పద్మావతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఆశీలు వేలం పాటలో ఎవరూ పాల్గొనక పోవడంతో వేలం పాటను వాయిదా వేశారు. ఈ సందర్భం గా కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ వేలం పాటలో ఎవరూ పాల్గొన లేదని, దీంతో ఈనెల 24వ తేదీకి వేలం పాటను వాయిదా వేశామన్నారు. గత ఏడాది ఆశీలు వేలం పాట ద్వారా మున్సిపాలిటీకి రూ.16.60 లక్షల ఆదాయం సమకూరిందన్నారు.

'గేట్'లో కుందూరు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కె.గంగవరం

కుందూరు గ్రామానికి చెందిన గోపి సత్య నిశాంత్ అనే విద్యార్థి గేట్ పరీక్షల్లో 142 ర్యాంకు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఇంటర్లో 976 మార్కులు సాధించి జెఇఇ మెయిన్స్ లో 563 ర్యాంకు సాధించిన తరువాత ఐఐటి అడ్వాన్సు పరీక్షల్లో ప్రతిభ కనబరిచాడు. ఇండోర్లో ఐఐటి సీట్ సాధించి రూ.20 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సంపాదించాడు. ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి అనంతరం గేటు పరీక్షలో 142 ర్యాంకు సాధించాడు.